సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



ఆహ్లాదం ఎక్కడ?

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరులో ఉన్న పార్కులు చిన్నారులకు ఆహ్లాదం అందించే స్థితిలో లేవు. 8లో



మళ్లీ మోదీ వస్తే ముప్పే

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం అధోగతి పాలవుతుందని కాంగ్రెస్ మహబూబాబాద్ అభ్యర్థి బలరాంనాయక్ అన్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. గంటగంటకూ ఎండ తీవ్రత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారి మూలమూర్తులను ముత్యాల వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏడీఎంహెచ్‌ఓగా భాస్కర్



పీఓ ప్రతీక్‌జైన్‌కు మొక్క అందజేస్తున్న డాక్టర్ భాస్కర్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో అడిషనల్ డీఎంహెచ్‌ఓగా సత్తుపల్లి ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎంఓ ఎల్.భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పీఓ సూచించారు. కాగా, ఇప్పటి వరకు అడిషనల్ డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు నిర్వర్తించిన దయానంద స్వామి మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు 7న పరీక్ష

భద్రాచలంటౌన్: వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీలో ప్రవేశాలకు ఈనెల 7న పరీక్ష నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులకు ఖమ్మంలోని ప్రతిభా కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 7న ఉదయం 9నుంచి 12 గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని పీఓ సూచించారు.

సాగర్ జలాలు విడుదల

కూసుమంచి: ఖమ్మం జిల్లా వాసుల దాహార్తి తీర్చేలా నాగార్జునసాగర్ డ్యాం నుండి నీటిని సోమవారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. ఈ నీరు మూడు రోజుల్లోగా పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుందని భావిస్తున్నారు. వాస్తవానికి 36గంటల్లోనే నీరు చేరాల్సి ఉన్నా తొలుత నల్లగొండ జిల్లాలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నింపాలని నిర్ణయించారు. అక్కడి నుంచి పాలేరుకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

కనిష్టస్థాయికి నీటిమట్టం

పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం ఆరు అడుగులకు పడిపోయింది. దీంతో ప్రధానంగా ఖమ్మం నగర వాసులకు తాగునీటి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అలాగే, పాలేరు నుండి మిషన్ భగీరథ, ఇతర ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని 2,439 గ్రామాల్లో 19.47 లక్షల మందికి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, పాలేరు నీటిమట్టం పడిపోవటంతో అధికారులు కాల్వలు తవ్వించి తాగునీటి ప్రాజెక్టులకు నీరందిస్తున్నారు. ఈనేపథ్యాన సాగర్ జలాలను విడుదల చేశారు.

నదీ తీరం.. అభివృద్ధికి దూరం

పావన గోదావరి తీరాన భద్రాచల పుణ్యక్షేత్రం కొలువై ఉంది. ఇక్కడి శ్రీ సీతారాముల వారి దర్శనానికి వచ్చే భక్తులు గోదావరి తీరానికి చేరుకుని నదీ స్నానం చేయడం తప్పనిసరిగా భావిస్తారు. వందల ఏళ్లుగా భద్రాచలానికి భక్తులు వస్తున్నా గోదావరి తీరంలో సరైన సౌకర్యాలు లేవు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- కరకట్ట మినహా మరే పనులూ చేపట్టని వైనం
- రోడ్లు, బెంచీల ఏర్పాటుకే పరిమితం
- కరకట్టపై కనీస సౌకర్యాలు కరువు

'రివర్ ఫ్రంట్' ట్రెండ్ అమలు చేయాలంటున్న భక్తులు



గోదావరి నదికి - భద్రాచలం పట్టణానికి మధ్య నిర్మించిన కరకట్ట

ఇరవై ఏళ్లుగా కరకట్టతోనే సరి..

వరదల నుంచి రక్షణ కోసం ఇరవై ఏళ్ల క్రితం భద్రాచలంలో గోదావరి తీరం వెంట సుమారు ఏడున్నర కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించారు. ఇందులో గోదావరి వంతెన దగ్గరి నుంచి పుష్కర ఘాట్ వరకు మూడున్నర కిలోమీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలు, బెంచీలు అమర్చారు. కరకట్ట దిగువ భాగంలో రామాయణ ఇతివృత్తం తెలిపేలా విగ్రహాలను ఏర్పాటు చేశారు. పుష్కరఘాట్ వద్ద స్నానఘట్టాలు పెంచడం మినహా గత ఇరవై ఏళ్లుగా అంతకు మించి కరకట్ట వెంట జరిగిన మరో అభివృద్ధి పని లేదు. వానాకాలం వస్తే పట్టణం నుంచి కరకట్ట దిగువన చేరిన వరదను గోదావరిలో ఎలా ఎత్తిపోయాలనే అనే అంశానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు.

కనిపించని రివర్ ఫ్రంట్ ట్రెండ్..

నదీ తీరంలో వెలిసిన కాశీ (వారణాసి) లాంటి ఆధ్యాత్మిక నగరాలు మొదలు అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి మెట్రో సిటీల్లో రివర్ ఫ్రంట్ పేరుతో నదుల వెంట అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రజలకు అహ్లాదాన్ని పంచేలా పార్కులు, థియేటర్లు, ఫుడ్ కోర్టులు, యోగా సెంటర్లు, వాకింగ్ ట్రాక్, ఎగ్జిబిషన్ సెంటర్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అయితే భద్రాచలం విషయానికి వస్తే మాత్రం గత ఇరవై ఏళ్లుగా ఇక్కడ గోదావరి తీరం వెంట ఇటు భక్తులు, అటు పుర ప్రజలు, పర్యాటకులను ఆకట్టుకునేలా, పట్టణానికి ఉన్న ఆధ్యాత్మిక శోభను పెంచేలా ఎలాంటి అభివృద్ధీ జరగలేదు.

ఎలివేటెడ్‌తో స్థల సమస్యకు చెక్..

రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం పట్టణాన్ని స్థల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టలన్నా అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలమే దిక్కు. దీంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా అందుబాటులో ఉన్న స్థలాన్నే బహుళార్థకంగా ఉపయోగించేలా ప్రణాళికలు రూపొందించాలి. కరకట్ట వెంట ఎలివేటెడ్ కాటేజీలు, ఫుడ్‌కోర్టు, రిక్రియేషన్ జోన్, బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింట్ తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. నగరాల్లో ఎలివేటెడ్ మెట్రోలు, రోడ్లు నిర్మించినట్టుగానే కరకట్ట దిగువ భాగం నుంచి ఎలివేటెడ్ పద్ధతిలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త నిర్మాణాలు చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. అంతేకాక కరకట్ట దిగువ నుంచి పిల్లర్ల ద్వారా కరకట్ట ఎత్తు వరకు శ్లాబ్ నిర్మించి, ఆ తర్వాత భక్తుల, పర్యాటకులకు అవసరమైన వివిధ సౌకర్యాలు కల్పించాలి. ఈ ఎలివేటెడ్ నిర్మాణాల పైనుంచి గోదావరి నదిని చూడటం భక్తులకు, పర్యాటకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం కూడా ఉంది. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవడంతో పాటు భద్రాద్రిలో వ్యాపార రంగం కూడా పుంజుకుంటుంది.

కష్టాల కరకట్ట..

భక్తులు రోజంతా ఉపవాసం ఉండి రామయ్య దర్శనం చేసుకున్నాక గోదావరిని కళ్లారా చూసేందుకు ఆర్తిగా వస్తుంటారు. అయితే వారికి ఆకలేస్తే అక్కడ తినడానికి ఏమీ లభించవు. అలసటతో ఉన్నవారు కూర్చునేందుకు కుర్చీలు కూడా కరువే. ఎర్రటి ఎండ, జడి వాన నుంచి రక్షణ కల్పించే సౌకర్యాలేమీ ఇక్కడ కనిపించవు. కరకట్టపై పట్టుపని పది నిమిషాలు నిల్చునే అవకాశం లేదు. దీంతో భక్తులు మొక్కుబడిగా పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని వెళ్లిపోవాల్సి వస్తోంది. గౌతమీ తీరంలో జరిగే తెప్పోత్సవం సందర్భంగా భక్తులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. చివరకు గోదావరి నదీమ తల్లికి హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమం కూడా సజావుగా సాగేందుకు ఇక్కడ ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల, లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి 12, 12–ఎ ఫారాలను శిక్షణా కేంద్రాల్లో అందజేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది తమ సొంత నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నట్టయితే ఎన్నికల ధ్రువీకరణ పత్రం (ఈడీసీ) తీసుకోవడం ద్వారా ఓటు వేసేందుకు ఫారం 12–ఎ అందజేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేవారు ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఈడీసీ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న వారు వివరాలు నమోదు చేయాలని అన్నారు. పోలింగ్ విధులకు హాజరు కాని సిబ్బందిపై ఈసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, మొదటిదశ శిక్షణకు కొత్తగూడెం అసెంబ్లీ నియోజవర్గ పరిధిలో 277 మంది, అశ్వారావుపేట 282, ఇల్లెందు 240, పినపాక 270, భద్రాచలం నియోజకవర్గం నుంచి 210.. మొత్తం 1279 మంది హాజరు కావాల్సి ఉండగా 90 మంది గైర్హాజరయ్యారని, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు ఆర్‌ఓలు మధు, కాశయ్య, భూమి, కొలతల శాఖ ఏడీ కుసుమకుమారి, ఇరిగేషన్ ఈఈ అర్జున్, ఇల్లెందు, కొత్తగూడెం, సుజాతనగర్ తహసీల్దార్లు రవికుమార్, పుల్లయ్య, శిరీష పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ ప్రియాంక ఆల హాజరయ్యారు. అనంతరం అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి సరఫరా విధానాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. 697 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. సీఎంఆర్‌పై రైస్‌మిల్లులను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. ప్రతీ గ్రామపంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో తాగునీటి కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. వడదెబ్బ జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం వడదెబ్బపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి, సీపీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ శిరీష, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, డీఆర్డీఓ విద్యాచందన, సివిల్ డీఎం త్రినాథ్‌బాబు, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, డీపీఓ ఖుర్షిద్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు ఇల్లెందులో కాంగ్రెస్ సమావేశం

ఇల్లెందు: మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం ఇల్లెందులో నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో పాటు పార్లమెంట్ పరిధిలోని ఐదు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, ముఖ్యనాయకులు పాల్గొననున్నారు.

మెనూ సక్రమంగా పాటించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్, పక్కన ట్రెయినీ కలెక్టర్ యువరాజ్

పాల్వంచరూరల్ : ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన ట్రెయినీ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులను బయటకు పంపించవద్దని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురైన విద్యార్థులను తక్షణమే ఆస్పత్రికి తరలించాలని చెప్పారు. విద్యార్థులకు నిత్యం ఓఆర్‌ఎస్ కలిపిన నీటిని తాగించాలన్నారు. సాయంత్రం వేళల్లో మాత్రమే విద్యార్థులను ఆటలు ఆడించాలన్నారు. పాఠశాలలో మైనర్ రిపేర్లు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు పంపించాలని హెచ్‌ఎం చందును ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, సురేష్, పీఈటీలు వీరన్న, వాసు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు ప్రోత్సాహకాలేవి?

- గతంలో లక్ష్యాన్ని సాధిస్తే బహుమతులు
- ఎనిమిదేళ్లుగా గిఫ్ట్‌లు నిలిపివేసిన సంస్థ
- ఈసారైనా ఇవ్వాలని వినతులు



గనుల్లో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): వందల అడుగుల లోతులో, ప్రకృతికి విరుద్ధంగా పనిచేస్తూ రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు వెలికితీసే సింగరేణి కార్మికులు సంస్థకు రూ.వందల కోట్ల లాభాలను సాధించిపెడుతున్నారు. అయితే, ఏటా లక్షల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశిస్తున్నా కార్మికులు ప్రతికూల పరిస్థితుల్లో చెమటోడ్చి లక్ష్యాలను చేరుకుంటున్నారు. కాగా, గతంలో లక్ష్య సాధనకు కృషి చేసిన కార్మికులకు ప్రోత్సాహకంగా యాజమాన్యం బహుమతులు అందజేసేది. బంగారు కాయిన్లు, ఇతరత్రా బహుమతులు ఇచ్చే ఆనవాయితీగా ఎనిమిదేళ్లుగా నిలిపేశారు. వంద శాతం లక్ష్యసాధన జరగడం లేదనే నెపంతో బహుమతులు నిలిపివేయగా.. ఈసారి మాత్రం 70 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యం దాటింది. అంతేకాక సింగరేణి సీఎండీ ఇటీవల సంస్థ రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని ప్రకటించారు. ఇందులో రూ.కనీసం 25వేల కోట్ల నికరలాభం వచ్చే అవకాశం ఉన్నందున కార్మికులకు బహుమతుల పంపిణీని పునరుద్ధరించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఇతర ప్రాంతాలకు నిధులు

కార్మికులు ఆరుగాలం కష్టించి పనిచేసిసంపాదించిన సొమ్మును సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధికి వెచ్చించాల్సి ఉంటుంది. కానీ కొన్నేళ్లుగా ఈ ఆనవాయితీని పక్కనపెట్టి ఇతర(ప్రభావితం లేని జిల్లాలకు) రూ.కోట్లలో కేటాయిస్తున్నారు. ఈమేరకు యాజమాన్యం స్పందించి కార్మికులను ప్రోత్సహించేలా బహుమతులు ఇవ్వాలని కోరుతున్నారు. తద్వారా సంస్థపై పెద్దగా భారం పడకపోగా.. కార్మికులు మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ఉపకరిస్తుంది.

టీబీజీకేఎస్ నిర్వాకమే కారణం



కార్మికుల కష్టంతోనే కంపెనీ మనుగడ ఉంటుంది. అయితే, బకాయిల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసే దమ్ము లేకపోవడమే కాక కార్మికుల బహుమతుల విషయాన్ని టీబీజీకేఎస్ నేతలు మరిచిపోయారు. త్వరలోనే సీఎండీని కలిసి ఈ విషయమై చర్చిస్తాం.

– కురిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ

బహుమతులు ఇస్తే రెట్టింపు ఉత్సాహం



కార్మికులు సంస్థకు రూ.కోట్లలో లాభాలు సమకూరుస్తున్నారు. కానీ 100 శాతం ఉత్పత్తి రాలేదంటూ వారికి ప్రోత్సాహకాలు నిలిపేశారు. ఈసారి కార్మికులు లక్ష్యసాధనకు కృషిచేసినందున బహుమతులు ఇస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తారు.

– మొగిలిపాక రవి, బీఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు


సంప్రదాయాన్ని కొనసాగించాలి...



కొన్ని సమయాల్లో వార్షిక లక్ష్యాలను సాధించటం సాధం కాదు. ఇది పూర్తిగా కార్మికుల తప్పేమీ కాదు. అయినా వార్షిక లక్ష్యం సాధించలేదనే నెపంతో కార్మికులకు బహుమతులు విస్మరించడం సరికాదు. ఇకనైనా గత సంప్రదాయాన్ని కొనసాగించాలి.

– అంతోటి నాగేశ్వరరావు, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

భానుడి భగభగ..



- జిల్లాలోని పలు ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఎండలు
- వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి

చుంచుపల్లి: వేసవికాలం ఆరంభంలోనే భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. సోమవారం సూర్యుడు భగ్గుమన్నాడు. జిల్లా కేంద్రం కొత్తగూడెం పరిధిలోని గరిమెళ్లపాడు, భద్రాచలం సబ్ కలెక్టరేట్ ఏరియాల్లో 41.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాత కొత్తగూడెంలో 40.5, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్‌లో 40.4, సీతారాంపట్నం, యానంబైలులో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మణుగూరు, ఇల్లెందు ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. రెండు, మూడు రోజులుగా ఎండలు పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 22, 23 డిగ్రీలకు చేరాయి. ఉదయం 10 గంటల నుంచే అన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కనిపిస్తోంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మరింతగా ప్రభావం చూపుతోంది. దీనికి తోడు వడగాల్పులు కూడా వీస్తున్నాయి. ఏప్రిల్ మొదట్లోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే మే నెలలో సూర్యుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, మరో మూడు, నాలుగు రోజుల వరకు ఎండల ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఈ వారంలోనే పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జాగ్రత్తలు పాటించకుంటే ముప్పే..

ప్రజలు వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇతర చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని సూచిస్తున్నారు. వేసవిలో చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుందని, ప్రతీ ఒక్కరూ రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలని అంటున్నారు. శీతల పానీయాలకు బదులు మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని సూచిస్తున్నారు. తీవ్ర ఎండలో బయటకు వెళ్లేవారు ఇంటికి వచ్చాక నిమ్మరసం తాగాలని, కర్బూజ, దోసకాయలు, ఇతర పండ్లు తీసుకోవాలని చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు నల్లటి దుస్తులు ధరించకుండా బాగా వదులుగా ఉండే తెల్లటి దుస్తులు ధరించాలని అంటున్నారు.

జూ పార్కుపై శీతకన్ను

- కిన్నెరసానిలో ఏర్పాటుచేయాలంటున్న పర్యాటకులు
- సర్కారుకు పెరగనున్న ఆదాయం..
- యువతకు ఉపాధి అవకాశాలు





కిన్నెరసాని డీర్ పార్కు ముఖ ద్వారం (ఇన్‌సెట్) డీర్‌పార్కులోని చుక్కల దుప్పులు

పాల్వంచ రూరల్: 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా ఉంది జిల్లా అటవీ శాఖ పరిస్థితి. ఆ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రూ.లక్షల వ్యయంతో వందల ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్కులు ఏర్పాటు చేశారు. కానీ జూపార్కు నిర్మాణంపై మాత్రం శీతకన్ను పెడుతున్నారు. 1977 జనవరిలో కిన్నెరసానిని అభయారణ్య కేంద్రంగా ప్రభుత్వం గుర్తించగా.. నాటి నుంచి ఇక్కడ వన్యప్రాణుల సంతతి వృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ జూపార్కు ఏర్పాటు చేస్తే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కిన్నెరసానిలో డీర్‌పార్కును 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అందులో ప్రస్తుతం 130కి పైగా చుక్కల దుప్పులు ఉండగా, అవి మాత్రమే పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. దీనికి తోడు ఇతర వన్యప్రాణులతో కూడిన జూపార్కు ఏర్పాటు చేయాలని పర్యాటకులు, ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

వన్యప్రాణులకు నిలయం..

కిన్నెరసాని అభయారణ్యంలో చిరుతలు, దున్నలు, జింకలు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, కొండముచ్చులు, మొసళ్లు, మూషిక జింకలు.. ఇలా అనేక రకాల వన్యప్రాణులకు నిలయంగా ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న డీర్‌పార్కును విస్తరించి జూపార్కుగా అభివృద్ధి చేయాలని సందర్శకులు కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడా జూపార్కులు లేవని, వరంగల్‌లో మాత్రమే మినీ జూపార్కు ఉందని, వన్యప్రాణులను చూడాలంటే అక్కడికే వెళ్లాల్సి వస్తోందని స్థానికులు అంటున్నారు. విస్తారమైన అటవీ ప్రాంతం, ఎన్నో అడవి జంతువులు ఉన్న ఈ జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో అనేక పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలు ఉన్నాయని, వీటికి తోడు జూపార్క్ కూడా ఉంటే సందర్శకుల తాకిడి పెరుగుతుందని చెబుతున్నారు.

జూపార్కు ఏర్పాటు చేయాలంటే..

జూపార్కు ఏర్పాటు చేయాలంటే ముందుగా కేంద్ర జూపార్క్ అథారిటీ అనుమతి పొందాలి. అందు కోసం జంతు సంరక్షణకు పార్కులో వసతులు కల్పించాలి. అవసరమైన బడ్జెట్‌ను రూపొందించుకుని సీసీఎఫ్‌కు, ఆ తర్వాత చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌కు ప్రతిపాదనలు పంపించాలి. వారు కేంద్ర జూపార్కు అథారిటీకి ప్రతిపాదనలు సమర్పించిన తర్వాత జూపార్కు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని కేంద్ర జూపార్కు అధికారులు సందర్శించి, వారు సంతృప్తి చెందితే అనుమతి మంజూరు చేస్తారు.

అంత సులభం కాదు



జిల్లాలో జూపార్కు ఏర్పాటు చేయడమనేది అంత సులభమైన విషయం కాదు. దానికి కేంద్ర జూ అథారిటీ అనుమతులతో పాటు భారీగా నిధులు అవసరం అవుతాయి. కిన్నెరసానిలో ఎకో టూరిజం అభివృద్ధి పనులపై దృష్టి సారించాం. పర్యాటకుల సందర్శన కోసం అభయారణ్యంలో సఫారీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీ శాఖాధికారి

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే 'పాదెం' కారు తనిఖీ

మణుగూరు టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మణుగూరులో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య కారును సీఐ సతీష్ కుమార్ తనిఖీ చేశారు. సోమవారం రాత్రి సీఐతో పాటు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పొదెం వీరయ్య బ్రాహ్మణపల్లి వెళ్లి వస్తుండగా ఆయన కారును సైతం తనిఖీ చేశారు. కాగా, అంతకుముందు సీఐ సతీష్ పట్టణంలో తిరుగుతూ తోపుడు బండ్లను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు కృషి చేయాలని చెప్పారు. ఆయన వెంకట ఎస్ఐ రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య సోమవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు మృతి చెందాడు. డీఆర్‌జీ, కోబ్రా 208, 204 బెటాలియన్ బలగాలు సోమవారం సుక్మా జిల్లా తెట్టమడుగు అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఈక్రమంలో ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టగా భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టగా ఓ మావోయిస్టు మృతదేహంతోపాటు ఆయుధాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు సుక్మా ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు.

మద్యం మత్తులో జర్నలిస్టుపై దాడి

నవభారత్: మద్యం మత్తులో ఆదివారం రాత్రి కొందరు యువకులు జర్నలిస్టుపై దాడి చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని గణేష్ టెంపుల్ సమీపంలో ఉన్న రవిబాలనికేతన్ పాఠశాల వద్ద రాత్రి 11 గంటల సమయంలో నలుగురు యువకులు మద్యం తాగి రోడ్డుపై మద్యం బాటిళ్లను పగలగొట్టి హల్‌చల్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటికి వెళుతున్న జర్నలిస్టు నాగేశ్వరరావు ఆ యువకులను ప్రశ్నించగా దర్భాషలాడుతూ దాడికి దిగారు. స్థానికులు గమనించి అక్కడకు రావడంతో నలుగురు యువకులు పరారయ్యారు. బాధితుడు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు జరుపుతున్నామని, ఇంకా కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

బైక్, లారీ ఢీ : యువకుడి మృతి

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పోలవరం గ్రామానికి చెందిన పైదా శంకర్(28) మోటార్‌సైకిల్‌పై భద్రాచలం నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద లారీ యార్డులోకి వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి జైలు శిక్ష


ఇల్లెందు: మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రిక రెడ్డి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఈ మేరకు కోర్టు కానిస్టేబుల్ పోషాలు వివరాలు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. దీంతో ఇల్లెందు మండలం లక్ష్మీనారాయణతండాకు చెందిన గుగులోతు మోతీలాల్‌కు ఏడు రోజులు జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా, ధర్మాపురం గ్రామానికి చెందిన చీమల నరేష్‌కు రెండు రోజుల జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టణంలోని కూనవరం రోడ్‌లో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీఎన్ రావు తెలిపారు.

ద్విచక్రవాహనం దగ్ధం

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో ద్విచక్ర వాహనం దగ్ధం చేసిన ఘటనలో నలుగురు యువకులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోటు గణేష్ కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం సుమారు 4:40 సమయంలో ఓ కారులో నలుగురు వ్యక్తులు పర్ణశాలకు వచ్చారు. అప్పటికే అక్కడ ఓ యువతి, ఓ పురుషుడు ఉండగా, అతన్ని పట్టుకుని కర్రలతో దాడి చేశారు. విపరీతంగా కొట్టగా గోదావరి ఒడ్డు వెంబడి పారిపోయాడు. అనంతరం పారిపోయిన వ్యక్తి బైక్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టారు. యువతిని కారులో ఎక్కించుకుని వెళ్తుండగా, పర్ణశాల గ్రామస్తులు ఆపి వివరాలు తెలుసుకున్నారు. తమ సోదరి ఆచూకీ కోసం రాగా, ఆమె మరో వ్యక్తితో ఉన్నట్లు గమనించామని పేర్కొన్నారు. ఆ నలుగురు యువకులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందినవారుగా తెలిపారు. స్థానికుడు తెల్లం హరికృష్ణ ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,171

ఆహ్లాదం ఎక్కడ?

పార్కులను పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- పని చేయని ఆట వస్తువులు, ఓపెన్ జిమ్‌లు
- నాలుగు మున్సిపాలిటీల్లోనూ అదే దుస్థితి
- వేసవి సెలవుల్లో చిన్నారులు సేద తీరడమెలా..?

సాక్షి ఫోకస్

విద్యాసంవత్సరం ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే పదో తరగత పరీక్షలు పూర్తికాగా, నేడు రేపో మిగతా తరగతులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పాఠశాలకు వెళ్లడం, ఇంటికొచ్చాక హోం వర్క్, ట్యూషన్ అంటూ విద్యార్థులు ఏడాదంతా బిజీగా గడిపారు. మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. దీంతో ఎంచక్కా ఉదయం, సాయంత్రం వేళ పార్కులకు వెళ్లి ఆడుకోవచ్చని చిన్నారులు ఉవ్విళ్లూరుతున్నారు. తల్లిదండ్రులతో కలిసి వెళ్లి రకరకాల ఆట వస్తువులతో ఆడుకుంటూ సంతోషంగా గడుపుతామనే భావనలో ఉన్నారు. మరికొందరు తమకు నచ్చిన క్రీడల్లో సాధన చేసి నైపుణ్యం పెంచుకోవాలని సంకల్పిస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారుల తీరుతో చిన్నారులు వేసవిలో ఆనందం, ఆహ్లాదానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

– కొత్తగూడెంఅర్బన్



మణుగూరు క్రీడాప్రాంగణంలో పిచ్చి మొక్కలు



కొత్తగూడెం రాజీవ్ పార్కులో పని చేయని ఫౌంటెన్

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో ఉన్న పార్కులు చిన్నారులకు ఆహ్లాదం అందించే పరిస్థితిలో లేవు. అన్ని పార్కులు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. క్రీడా సామగ్రి తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా తయారయ్యాయి. పార్కుల నిర్వహణ సరిగా లేక అధ్వానంగా మారాయి. అందులో నాటేందుకు తెచ్చిన మొక్కలు సైతం ఎండిపోయాయంటే నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణాల్లోని ప్రధాన పార్కులతో పాటు మినీ పార్కులు, ఓపెన్ జిమ్‌ల్లోనూ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. వ్యాయామ శిక్షణ ఇచ్చేందుకు మున్సిపల్ అధికారులు శిక్షకులను నియమించలేదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఓపెన్ జిమ్ సామగ్రి వృథాగా పోతోంది. నిర్వహణ సరిగా లేక తుప్పుపట్టి విరిగిపోతున్నాయి. ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించనుండగా, మున్సిపల్ అధికారులు చొరవ చూపి పార్కుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.



పని చేయని ఊయల

ప్రగతిమైదాన్ పక్కనున్న రాజీవ్ పార్కులో పిల్లల ఆట సామగ్రి అంతా తుప్పుపట్టింది. సిమెంట్ బల్లలు విరిగిపోయాయి. బాత్‌రూమ్‌లు పనిచేయక మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఏడాదిన్నర క్రితం రాజీవ్ పార్కును దాదాపు రూ.25లక్షలతో పునర్నిర్మించారు. అయినా ఇంకా సమస్యలు దర్శనమిస్తూనే ఉన్నాయి.



సింగరేణి పార్కులో తుప్పుపట్టిన ఆట సామగ్రి

బస్టాండ్ సెంటర్‌లోని సింగరేణి చిల్డ్రన్స్ పార్కుల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఈ పార్కులో పిల్లల ఆట సామగ్రి తుప్పు పట్టి ఉంది. పార్కు ప్రవేశ మార్గం చెత్తతో నిండింది.

సదుపాయాల కల్పనకు చర్యలు



కొత్తగూడెం మున్సిపాలిటీలోని పార్కులు వేసవిలో ఆహ్లాదం అందించేలా చర్యలు తీసుకుంటాం. పిల్లల ఆట సామగ్రికి మరమ్మతులు చేయిస్తాం. పాలకవర్గ అనుమతితో ప్రత్యేకంగా నిధులు కేటాయించి పార్కుల్లో బల్లలతో పాటు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేయిస్తాం.

– శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

అమలుకాని ప్రణాళికలు



రైల్వే అండర్ బ్రిడ్జిపైన పార్కు ప్రతిపాదిత స్థలం

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి పైన కుడి వైపు ఖాళీగా ఉన్న ప్రాంతంలో పట్టణానికి వన్నె తెచ్చేలా పార్కు ఏర్పాటు చేయడానికి మున్సిపల్ అధికారులు ప్రణాళిక తయారుచేశారు. కానీ ఎన్నికల అనంతరం అది అటక్కెకింది. ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేస్తే పట్టణానికి సరికొత్త శోభ సంతరించుకునే అవకాశం ఉంటుంది. అలాంటి ప్రణాళికపై స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ పాలక వర్గం దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



పంచవటిక పార్కులో విరిగిపోయిన జిమ్ సామగ్రి

కొత్తగూడెం రైటర్ బస్తీలోని పంచవటిక పార్కు ఆవరణంతా చెత్తకుప్పల మయంగా ఉంది. వాకింగ్ ట్రాక్ మట్టి, బురదతో అధ్వానంగా మారింది. ఓపెన్ జిమ్ సామగ్రి కూడా పని చేయకపోవడంతో పార్కుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది కనీసం చెత్తను కూడా శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్డి

పార్కులు ప్రస్తుతం ఎలా ఉన్నాయంటే..

కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లోని పార్కుల్లో సరైన సదుపాయాలు లేవు. సందర్శకులు కూర్చునే సిమెంట్ బల్లలు విరిగిపోయాయి. వాకింగ్ ట్రాక్‌లు చెత్తాచెదరంతో నిండిపోయాయి. పచ్చదనం వెల్లివిరియాల్సి ఉండగా, మొక్కలు ఎండి కనిస్తున్నాయి. కొత్తగూడెం మున్సిపాలిటీలో రాజీవ్ పార్కు, సింగరేణి చిల్డ్రన్స్ పార్కు, పంచవటిక పార్కులతో పాటు కొన్ని వార్డుల్లో మినీ పార్కులు ఉన్నాయి. నిర్వహణ సక్రమంగా లేక అన్ని పార్కులు అధ్వానంగా మారాయి. మిగిలిన మున్సిపాలిటీల్లో అదే పరిస్థితి నెలకొంది.

'నవోదయ' ఫలితాలు విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు జనవరి 20న పరీక్ష నిర్వహించగా, సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఫలితాలను వెల్లడించారు. ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 3,140 మంది విద్యార్థుల్లో 2,492 మంది హాజరయ్యారు.

అర్హత సాధించిన విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లు..

ఎం 3462774, ఎం 3464573, కే 3464588, ఓ 3464750, ఎన్ 3462849
ఎఫ్ 3463104, జే 3463221, జే 3464177, జే 3464480, కే 3462142
జీ 3464496, కే 3464620, ఎల్ 3464966, జే 3465050, ఎల్ 3465195
ఎల్ 3464775, ఎల్ 3464838, ఎల్ 3464965, పీ 3465075, ఎల్ 3465127
ఎల్ 3462143, ఐ 3462379, జే 3462529, జే 3462718, ఓ 3462740
జే 3462764, జే 3463111, జే 3463140, జే 3463388, జే 3464182
ఎల్ 3464272, కే 3464446, జే 3464495, ఎన్ 3464557, జే 3464699
కే 3464856, ఎన్ 3465068, జే 3465101, ఎన్ 3465144, జే 3462951
జే 3462953, జే 3463151, జే 3463444, జే 3463941, ఎన్ 3464376
జే 3464622, ఎన్ 3464634, జే 3464637, ఎన్ 3464677, ఎన్ 3464679
జే 3464702, జే 3464711, జే 3464746, ఎన్ 3464778, ఎన్ 3464780
ఓ 3462703, ఓ 3462860, కే 3462930, కే 3462966, కే 3463277
కే 3463446, ఓ 3463500, ఓ 3463594, ఓ 3464417, ఓ 3464825
పీ 3462134, పీ 3462208, ఎల్ 3462229, పీ 3462372, పీ 3462730
ఎల్ 3462796, ఎల్ 3463236, పీ 3463518, ఎల్ 3463922, పీ 3464298
పీ 3464362, ఎల్ 3464770, పీ 3464873, ఎల్ 3465201, ఎల్ 3465205

మళ్లీ మోదీ వస్తే 1/70, రిజర్వేషన్లకు ముప్పు

మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్



మాట్లాడుతున్న బలరాంనాయక్, పక్కన ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

ఇల్లెందు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి మోదీ అధికారంలోకి వస్తే దేశం అథోగతి పాలు కావడం ఖాయమని కాంగ్రెస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తెలిపారు. ఇల్లెందులో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ఇంకోసారి అధికారంలోకి వస్తే 1/70 చట్టం, రిజర్వేషన్లను రద్దు చేసే ప్రమాదముందన్నారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని సాధిస్తానని తెలిపారు. అలాగే, సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. గత ఎంపీలు సీతారాంనాయక్, కవిత ఈ నియోజకవర్గానికి చేసిన మేలు ఏదీ లేదన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలుచేస్తున్న హామీలను పార్టీ శ్రేణులు గడపగడపకూ వివరించి బలరాం విజయానికి పాటుపడాలన్నారు. ఇంకా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కాంగ్రెస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు జె.వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు, జాఫర్, పింగళి నరేష్, ఈసం నర్సింహ్మారావు, మడుగు సాంబమూర్తి, సుదర్శన్ కోరీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పేటలో 'కమర్షియల్' తనిఖీలు?



అధికారుల సైగతో గ్రామశివారుకు వెళ్తున్న లారీలు

అశ్వారావుపేట: కొంతకాలంగా ఏపీ నుంచి అనుమతి లేకుండా తెలంగాణలోకి ప్రవేశిస్తున్న ఇసుక, కంకర, పాత ఇనుము, ప్లాస్టిక్, స్టీలు సామగ్రి లోడ్ వాహనాలను కొందరు టార్గెట్ చేసి నిలుపుదల చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందినకాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. అశ్వారావుపేటలో సోమవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో రింగ్ సెంటర్‌లో ఖమ్మానికి చెందిన కమర్షియల్ ట్యాక్స్ అధికారులు లారీలను నిలిపివేశారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా, మరో వ్యక్తి లారీ డ్రైవర్లతో మంతనాలు జరుపుతున్నాడు. తాను ఏసీటీఓ శ్రీరామ్ అని, రూ. 5 వేల లోపు ఉన్న వే బిల్లులు, ట్యాక్స్ వివరాలను మాన్యువల్ చెక్ చేయాల్సి ఉంటుందని, ఇందుకు సమయం పడుతుందని 'సాక్షి'కి తెలిపారు. అనంతరం వాహనాల ఫొటో తీయగా ఊరిబయట ఆపాలంటూ డ్రైవర్లకు సైగ చేయడంతో లారీలు వెళ్లిపోయాయి. ఇదేమిటని ప్రశ్నించగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని ఊరి బయట చెక్‌చేస్తామంటూ వెళ్లిపోయారు. ఇదే రింగ్ సెంటర్‌లో ఫారెస్టు, వ్యవసాయ శాఖ చెక్‌పోస్టులు దశాబ్దాల తరబడి ఉన్నాయి. వారు రోజూ వాహనాలు చెక్ చేస్తూనే ఉన్నారు. ఫారెస్ట్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు రాని ట్రాఫిక్ ఇబ్బంది.. ఫొటో తీయగానే ట్రాఫిక్ ఇబ్బందని పేర్కొంటూ వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి, వాస్తవాలు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

మొరాయించిన పల్లెవెలుగు బస్సు

చండ్రుగొండ : సత్తుపల్లి డిపోకు చెందిన పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు చండ్రుగొండలో సోమవారం మొరాయించింది. మరమ్మతులకు గురవడంతో డ్రైవర్ నిలిపివేశాడు. దీంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. అనంతరం అదే డిపోకు చెందిన మరో బస్సు రావడంతో గమ్యస్థానాలకు చేరుకున్నారు. పల్లె వెలుగు సర్వీసులు తరచు మరమ్మతులకు గురవుతున్నాయని, ఆర్టీసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

శభాష్.. పోలీస్

- 100కు డయల్ చేసి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన మణుగూరు బ్లూకోల్ట్ సిబ్బంది

మణుగూరు టౌన్: భార్య దూరం కావడంతోపాటు కొందరు అకారణంగా దాడి చేయగా మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని సోమవారం మణుగూరు పోలీసులు కాపాడారు. మండలంలోని కూనవరం పంచాయతీ చంద్రబాబు నగర్‌కు చెందిన గుగులోత్ రవి కొంత కాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో చిన్న వివాదం కూడా జరిగింది. దీంతో మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం 100కు డయల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలో పట్టణంలోని పూలమార్కెట్ ఏరియాలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్ సిబ్బంది కృష్ణ, వీర తక్షణమే 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న రవి ఇంటికి చేరుకున్నారు. తలుపులు బద్దలుకొట్టి ఆత్మహత్య నుంచి కాపాడారు. అప్పటికే ఉరివేసుకున్న రవి అపస్మారక స్థితిలోకి వెళ్లగా, బ్లూకోల్ట్ సిబ్బంది సీపీఆర్ చేసి, 100 పడకల ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందగానే స్పందించి వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బందిని మణుగూరు సీఐ సతీష్, ఎస్ఐ ప్రసాద్, రాజేశ్ అభినందించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన కునసోతు మోహన్‌రావు(46)కు భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 30న భార్యతో వాగ్వాదానికి దిగి, ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన పెద్ద కుమార్తె దుర్గాభవానిని కూడా కొట్టాడు. దీంతో మనస్తాపం చెంది దుర్గాభవాని ఇంటి ఆవరణలో ఉన్న బావిలో దూకగా, గమనించిన గ్రామస్తులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. కుమార్తె ఆత్మహత్యాయత్నంతో భయాందోళనకు గురైన మోహన్‌రావు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా, తాను పురుగుల మందు తాగలేదని చెప్పి ఇంటికి వచ్చేశాడు. మళ్లీ 31న తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో, మరోసారి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కొత్తగూడెం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఆటోడ్రైవర్..

కొత్తగూడెంటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఆటోడ్రైవర్ జీవితంపై విరక్తి కలిగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తగూడెం టూటౌన్ పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం లక్ష్మీపురం తండా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ బానోతు కిషన్(35)కు ఫిట్స్‌తోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. దీంతో మనోవేదనకు గురవుతున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆటో నడిపేందుకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. లక్ష్మీపురం తండా ప్రాంతంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

నలుగురిపై దాడి కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో ఓ మాజీ సర్పంచ్ సహా మరో ముగ్గురు కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఒంటిపల్లి శివరామకృష్ణ ఇంటి ఆవరణలో ఓ చెట్టు ఉంది. కొద్ది రోజులుగా పక్కనే ఉన్న మాజీ సర్పంచ్ కొడిమి సీతకు చెందిన నాటు కోళ్లు రాత్రి వేళ చెట్టు ఎక్కి కూర్చుంటున్నాయి. కాగా కోళ్లు పెంట వేయడంతో దుర్వాసన వస్తుందని బాధితుడు చెబుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 25న ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. శివరామకృష్ణ, అతని తల్లి గంగమ్మపై మాజీ సర్పంచ్ కొడిమి సీత, ఆమె కుటుంబీకులు కొడిమి వెంకన్నబాబు, కొడిమి వినోద్, బత్తుల కొండ కలిసి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో శివరామకృష్ణ కాలు, చేయి విరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మాజీ సర్పంచ్‌తోపాటు మిగిలిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్మకాలు

పాల్వంచ: పట్టణ పరిధిలోని హమాలీ కాలనీ, వనమా కాలనీల్లో రెండు కిరాణా షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సోమవారం పోలీసులు దాడి చేశారు. రూ.10 వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, షాపు నిర్వాహకులు కళ, జోయాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.